క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

యల్లనూరు: మండలంలోని శింగవరంలో మంగళవారం మధ్యాహ్నం 4గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



వాహనదారులు, మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రామసుబ్బయ్య

గుంతకల్లు రూరల్: మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య హెచ్చరించారు. డీఎస్పీ నరసింగప్ప ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమీపంలో విజిబుల్ పోలీసింగ్, యాక్సిడెంట్ నియంత్రణలో భాగంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వాహనాలతోపాటు, మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న 10 వాహనాలను సీజ్ చేశారు. మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



పుస్తక పఠనంపై వివరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

తాడిపత్రి టౌన్: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యనారాయణరెడ్డి, సేతు, వీరారెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం సమ్మర్ విజ్ఞాన తరగతుల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి రవికుమార్ నాయుడు ఆధ్వర్యంలో కథల పుస్తకాలు, మహానుభావుల జీవి చరిత్రలు, సైన్స్, క్విజ్, పురాణాలు వాటి విశిష్టతను తెలియజేశారు.

ఫ్రీజర్ వితరణ

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి లయన్స్ క్లబ్ సభ్యులు ఫ్రీజర్ బాక్సును సోమవారం అందించారు. లయన్స్ క్లబ్ గవర్నర్ రామచంద్ర ప్రకాష్‌రావు నేతృత్వంలో సభ్యులు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్పకు ఫ్రీజర్ బాక్సును అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి విరూపాక్షి రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు మక్బూల్, సంబంధ మూర్తి, సురేష్‌బాబు, 108 శీన పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు : ఆవులాంపల్లి గ్రామంలో సోమవారం రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆరుపళ్ల విభాగంలో పోటీలు నిర్వహించగా, 18 జతల వృషభాలు పాల్గొన్నాయి. 9 జతలకు బహుమతులను ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిగా బీరం బుల్స్ రూ.50 వేలు, జూటూరు రామచంద్రారెడ్డి, పీఆర్ పల్లి హోటల్ బలరాం బుల్స్‌కు రెండో రూ.40వేలు, మూడో బహుమతి ఎల్లాగౌడ్ రుద్రవరం, గుడిపాడు ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి బుల్స్ రూ.30 వేలు అందించినట్లు తెలిపారు. 16న న్యూ క్యాటగిరి, 17న సీనియర్ విభాగం వృషభాలకు పోటీలు ఉంటాయన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



రోడ్డు శుభ్రం చేస్తున్న కార్మికులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. శానిటేషన్ వర్కర్లు మురుగు కాలువలు, చెత్తాచెదారం శుభ్రం చేశారు. అపరిశుభ్రత ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో శానిటరీ మేస్త్రీలు, శానిటరీ వర్కర్లు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- నాల్గో విడత ప్రజా సంక్షేమ యాత్రలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి స్వాగతం పలుకుతున్న వెంకటరెడ్డిపల్లి గ్రామ ప్రజలు

తాడిపత్రి టౌన్: కులం లేదు.. మతం చూడలేదు..రాజకీయపార్టీలకతీతంగా.. అర్హత ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాల్గో విడత ప్రజా సంక్షేమయాత్ర మండలంలోని వెంకటరెడ్డి, తెల్లమిట్టపల్లి, గదరగుట్టపల్లి, బుగ్గ, భోగసముద్రం, అయ్యవారిపల్లి గ్రామాల్లో సాగింది. మొదటి వెంకటరెడ్డిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి యాత్రను ప్రారంభించారు. ఎమ్మెల్యేకు వైఎస్సార్ సీపీ నేత పుల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. అంతకు ముందు తాడిపత్రిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎమ్మెల్యే తెలియజేశారు. గ్రామంలో సబ్సిడీ స్ప్రింక్లర్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ప్రజలు శాంతియుతంగా జీవనం సాగించాలన్నారు. అనంతరం తెల్లమిట్టపల్లి, గదరగుట్టపల్లి గ్రామాలమీదుగా ప్రజా సంక్షేమ యాత్ర సాగింది. అనంతరం బుగ్గలో అయ్యవారిపల్లి సర్పంచ్ రామమోహన్‌రెడ్డితోక లసి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు మహిళలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పేరుపేరునా ఆప్యాయంగా పలకించారు.

ఆర్బీకేను ప్రారంభించిన ఎమ్మెల్యే..

అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో అభివృద్ధి – సంక్షేమం గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సీఎం జగనన్న పాలనలో అమ్మ ఒడి, విద్యాకానుక, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, నాడు–నేడు పాటు పలు సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందాయన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత ఎమ్మెల్యేను కలిసి ప్రజాసంక్షేమయాత్రకు సంఘీభావం తెలిపారు. ప్రజా సంక్షేమ యాత్రలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గూడూరు సూర్యనారాయరెడ్డి , అనంతపురం పార్లమెంట్ యువజన విభాగ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, యాడికి, పెద్దవడుగూరు మండల కన్వీనర్లు బొంబాయి రమేష్, ఎద్దుల శరాబారెడ్డి, పెద్దవడుగూరు జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చిదంబర్‌రెడ్డి, ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, తాడిపత్రి జెడ్పీటీసీ కురవ రమణమ్మ, పెద్దపప్పూరు, తాడిపత్రి ఎంపీపీలు, రాంమూర్తిరెడ్డి, సరస్వతి, వెంకటరెడ్డిపల్లి సర్పంచ్ శ్రీదేవి, నాయకులు పుల్లారెడ్డి, కాకర్ల రంగనాథ్, రామేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామ శేఖర్, హనుమంతరెడ్డి, పురుషోత్తమరెడ్డి, రాంమోహన్‌రెడ్డి, రాము, సోమేశ్వరరెడ్డి, శివారెడ్డి, రమేష్, కంది గోపుల మురళీ ప్రసాద్‌రెడ్డి, నగరూరు బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

- ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మరోసారి గెలిపించి, అభివృద్ధికి బాటలు వేయాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రజలను కోరారు. సోమవారం మొలకలపెంట, మొలకలపెంట తండా గ్రామాల్లో ఎమ్మెల్యే వైవీఆర్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజల క్షేమ సమాచారాలు, సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు.

ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరింది..

నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని, ఇంకా ఎవరికైనా పథకాలు అందకుంటే గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా తెలుసుకుని పరిష్కరించేందుకు ఇంటింటికీ వస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తూ వచ్చారన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత జగనన్నకు మాత్రమే దక్కుతుందన్నారు. విద్య, వైద్య రంగాల్లో జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యానికి నాందీ పలికారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీవీ మాధవి, ఈవోఆర్డీ బారన్ సాహెబ్, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మండల కన్వీనర్ మోహన్‌రావు, సచివాలయ మండల కన్వీనర్ గోవిందు నాయక్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సర్పంచ్ మురహరి నాయుడు, ఎంపీటీసీ నాగప్ప, మాజీ సర్పంచ్ గోపాల్ నాయక్, కొంగనపల్లి ఎంపీటీసీ హరి చక్రవర్తి, జగన్‌మోహన్, పార్థ నాయుడు, కృష్ణమూర్తి, హనుమంతు, యోగానందరెడ్డి, నాగరాజు, వెంకటేష్ నాయక్, పెద్దన్న, రంగనాయకులు, దొర నాయుడు, బాలు, వీరన్న, రంజిత్, కొంగనపల్లి రవి, నాగార్జున, వంశీ నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్లముంగిటకే సంక్షేమ పథకాలు

గుంతకల్లు రూరల్: సచివాలయాల ఏర్పాటుతో ఇళ్ల ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మొలకలపెంట గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని సర్పంచ్ మురహరి నాయుడు, ఎంపీపీ మాధవితో కలిసి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఎమ్మెల్యే వైవీఆర్ ఆర్థిక సాయం

పామిడి: పామిడి కొత్తపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎల్లారెడ్డి గారి భీమిరెడ్డి కుటుంబ అభిమాని సూర్యనారాయణరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి సోమవారం రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. రోడ్డు ప్రమాదంలో ఎల్.సూర్యనారాయణరెడ్డి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే..బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, మండల ఇన్‌చార్జ్ జానకి రామిరెడ్డి, సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

విద్యార్థులకు అభినందనలు



పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న సీనియర్ డీపీఓ చౌహాన్



డ్రాయింగ్‌లో రెండో స్థానంలో నిలిచిన సాయి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన పలువురు రైల్వే హైస్కూల్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులను సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్ అభినందించారు. సోమవారం హైస్కూల్ ప్రిన్సిపాల్ మధుసూదన్ ఆధ్వర్యంలో విద్యార్థులు రితిక (553), ప్రణవ్ (516)ను సీనియర్ డీపీఓ చాంబర్‌లో అభినందించారు. రైల్వే పాఠశాలల ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ పోటీల్లో గుంతకల్లు రైల్వే హైస్కూల్ 7వ తరగతి విద్యార్థి సాయి శ్రీనివాస్ రెండో స్థానంలో నిలిచాడు. దీంతో విద్యార్థి హెచ్. సాయిశ్రీనివాస్‌ను సీనియర్ డీపీఓ అభినందించారు. సీనియర్ డీపీఓ చౌహాన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ లక్ష్యం నిర్దేశించుకొని ఆదిశగా ప్రయత్నిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు జూన్ 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి నరేంద్రనాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ఐటీఐలో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. జూన్ 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఐటీఐ కళాశాలలో ఒరిజనల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. డ్రాఫ్ట్స్‌మెన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ మోటార్ వెహికల్, మెకానిక్ డీజిల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ కోపా కోర్సులు ఉన్నాయన్నారు.

స్పందనకు ఆరు వినతులు

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆరు వినతులు అందినట్లు తహసీల్దార్ మహబూ బాషా తెలిపారు. ఇంటి పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకం, పొలం కొలతలు, మ్యుటేషన్లపై రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, ఏపీఓ మద్దిలేటి, ఎంఈఓ రవినాయక్ పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

పామిడి: పట్టణ ఎంపీడీఓ సభా భవనంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, సభ్యులు, అధికారులు, అనధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు



అలంకరణలో పామిడి విఠోబస్వామి



స్వామివారి ప్రాకారోత్సవ దృశ్యం

పామిడి: పట్టణ చిన్న విఠోబ ఆలయంలో సోమవారం రంగ సుభే ఫిర్కా ఆధ్వర్యంలో ఏకాదశి పూజలు నిర్వహించారు. విఠోబస్వామిని శోభాయమానంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా భజనబృందం ఆలపించిన స్వామివారి కీర్తనలు పలువురినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. రుక్మిణీ పాండురంగ స్వామి ఉత్సవ విగ్రహాల ప్రాకారోత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణం పాండురంగస్వామి నామస్మరణతో మార్మోగింది. మంగళహారతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధ్యక్షుడు టీటీ నాగభూషణ్‌రావు, సెక్రటరీ టీటీ శ్రీనివాసరావు, యూ మంజునాథ్‌రావు, భజన మండలి అధ్యక్షుడు మురళీ సుందర్, ఉపాధ్యక్షుడు జగదీష్ పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలి

గుంతకల్లు రూరల్: అకాల వర్షాలతో పంటనష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఎం నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్‌లలో అధిక వర్షాలతో పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు బీ.శ్రీనివాసులు, దాసరి శ్రీనివాసులు, సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి ఇతర నాయకులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లలో అత్యధికంగా భారీ వర్షాలు, ఈదురు గాలులకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లప్ప కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నల్లప్ప మాట్లాడుతూ మండలంలో అకాల వర్షాలకు ఉద్యాన పంటలు, వరి, మొక్కజొన్న, పంటలు భారీ ఎత్తున దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 30 వేలు పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కుల్లాయప్ప, రమేష్, నాగార్జున, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: గాలీవాన బీభత్సానికి పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని డీటీ శ్వేతకు సీపీఎం నాయకులు సోమవారం విన్నవించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజారాంరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్‌లో అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు ఓబులేసు, రమేష్, రామాంజనేయులు, మునేంద్ర, వెంకటకొండ పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

పామిడి: పట్టణ దుర్గమ్మవీధిలోని ఆర్డీటీ స్కూల్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్–సవేరా సౌజన్యంతో సోమవారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు నాగరాజు 85 మందికి వైద్యపరీక్షలు చేశారు. 17 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు తూర్పింటి మల్లికార్జున, భరత్, రాజశేఖర్, బాలు, సునీల్, శేఖర్, రాజేష్, బెస్త నారాయణమూర్తి, ఆస్పత్రి మేనేజర్ శ్రీనివాసులు, రియా, రోగులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో మరిన్ని సౌకర్యాలు



నైవేద్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, ఈఓ

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన నిత్య నైవేద్య వినియోగ కేంద్రాన్ని వారు సోమవారంప్రారంభించారు. అనంతరం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈఓతో పాటు సభ్యులు చంద్ర, తిమ్మారెడ్డి, సురేష్‌కుమార్ తదితరులు మాట్లాడారు. జిల్లాలోని ప్రధాన శైవక్షేత్రాలతో పాటూ పూజలందుకుంటున్న శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో రుద్రాభిషేకాలకు భక్తులు వస్తుంటారన్నారు. వీరికి తీర్థప్రసాదాలతో పాటు ఫలహారమందించాలని తీర్మానించారు. బయట నుంచి నైవేద్యాలను తెప్పించే పద్ధతికి స్వస్తి పలికి ఆలయంలోనే తయారు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జీజే వేణు, వైఎస్సార్‌సీపీ నాయకులు రిలాక్స్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

20లోపు ఈకేవైసీ చేయించుకోండి

గుంతకల్లు: ప్రభుత్వ పెన్షన్‌దారులు ఈనెల 20లోపు ఈకేవైసీ చేయించుకోవాలని గుంతకల్లు అర్బన్ అండ్ రూరల్ పెన్షనర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే మస్తానప్ప, కోశాధికారి ఎస్.మహబుబ్‌పీరా ఓ ప్రకటనలో తెలిపారు. అర్బన్, రూరల్ పరిధిలోని ప్రభుత్వ పింఛన్‌దారులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీకి రిజిస్ట్రేషన్లు

గార్లదిన్నె: రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ పంపిణీ కోసం రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు ఏఓ సోమశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ పంపిణీ ఉంటుందన్నారు. ప్రభుత్వం ద్వారా 40 శాతం రాయితీతో రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. కే6 రకం విత్తన వేరుశనగ క్వింటా ధర రూ.9,300 కాగా, 40 శాతం రాయితీతో రైతుకు రూ.5,580కి అందిస్తామన్నారు.

నేడు ప్రజా సంక్షేమ యాత్ర

తాడిపత్రి టౌన్: అయ్యవారిపల్లి తండా, వెంకటాంపల్లి, తిమ్మేపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నాల్గో విడత ప్రజా సంక్షేమ యాత్ర జరగనున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో ధనుంజయ అనే వ్యక్తి సోమవారం ఆటోలో నుంచి ప్రమాదవశాత్తూ జారి కింద పడి గాయపడ్డాడు. గుత్తి ఆర్ఎస్ నుంచి గుత్తికి వెళ్తున్న ఆటోలో ధనుంజయ ఆటో వెనుక భాగంలో కూర్చున్నాడు. ప్రమాదవశాత్తూ జారి కింద పడి గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

తాడిపత్రి టౌన్: కడప రోడ్డులో సోమవారం సాయంత్రం ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడింది. కడప రోడ్డు ఐశ్వర్య విలాస్ నుంచి తాడిపత్రికి వస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. గాయపడిన మహిళను చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

నేడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో హెచ్‌డీఎస్

అనంతపురం క్రైం: జేఎన్‌టీయూ సమీపంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ గౌతమి అధ్యక్షతన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డీఎస్) సమావేశం జరగనుంది. సర్వజనాస్పత్రిలోని వివిధ విభాగాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అంశాలతోపాటు ఏసీలు, కంప్యూటర్ల నిర్వహణపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ అజెండాను సిద్ధం చేశారు. కలెక్టర్ గౌతమి బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా జరుగుతున్న హెచ్‌డీఎస్ సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో పాల్గొనండి

అనంతపురం కల్చరల్: ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో జిల్లా వాసులు పాల్గొని తరించాలని దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ రామాంజనేయులు కోరారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న శతకుండాత్మక, చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీమహాలక్ష్మి యజ్ఞాన్ని, పలు దేవతామూర్తుల కల్యాణోత్సవాలను తిలకించాలని ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్ర స్వామి సూచించారన్నారు. ఇక రెండు రోజులు మాత్రమే సమయం ఉందన్నారు.

బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బీజేపీ ఎంపీ, ఆల్ ఇండియా రెజ్లర్ల సంఘం అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎన్జీఓ హోమ్ నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తమ పార్టీ ఎంపీపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌బాబు, చంద్రప్ప, వీరేంద్ర, శంకర్, తిప్పయ్య, రామాంజినేయులు, దావీద్ పాల్గొన్నారు

ఘర్షణ కేసులో వ్యక్తి అరెస్ట్

యల్లనూరు: ఘర్షణ కేసులో దంతలపల్లి గ్రామానికి చెందిన శివనాగిరెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సర్పంచ్ నాగమహేశ్వరరెడ్డి వర్గానికి అదే గ్రామానికి చెందిన మరో వర్గమైన బాలవెంకటరెడ్డి వర్గానికి పాత కక్షలు, ఉపాధి పనుల్లో అవకతవకలు, అక్రమాలు చేస్తున్నారన్న విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడిన విషయం విదితమే. కేసులో శివనాగిరెడ్డిని అరెస్ట్ చేశామని ఎస్ఐ తెలిపారు. మిగిలినవారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.